




# కలం కౌంటర్

KALAM COUNTER TELUGU DAILY

తెలుగు దినపత్రిక

సంపుటి : 9 సంచిక : 329

పేజీలు : 4 వెల రూ.4/-

Circulated by : Krishna, Guntur, Prakasam, Nellore, West Godavari, Khammam, Hyderabad, Chittor

బుధవారం 20 మే 2026


# తీరం మనదే-మత్స్య సంపదా మనదే

- మన జలాల్లో గస్తీ పెంచి మత్స్యకారుల హక్కులు కాపాడతాం
- చేపల వేటకు సబ్సిడీపై 200 మెకనైజ్డ్ బోట్లు
- సీవీడ్ సాగుతో మత్స్యకార మహిళలకూ ఉపాధి అవకాశాలు
- నీటి వనరుల్లో చేపల సాగు చేసుకునే అధికారం మత్స్యకారులదే
- మత్స్యకారుల సేవలో భాగంగా రూ.262 కోట్లను పంపిణీ చేసిన సీఎం
- ప్రజా ప్రభుత్వానిది సంక్షేమం - గొడ్డలి పార్టీది ఫేక్ ప్రచారం
- నెల్లూరు జిల్లా కావలిలో మత్స్యకారుల సేవలో కార్యక్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబు












**నెల్లూరు/కావలి,కలంకౌంటర్ :** తీర ప్రాంత అభివృద్ధిలో మత్స్య కారులకు భాగస్వామ్యం కల్పిస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. మత్స్య కారుల సంక్షేమానికి.. వారి జీవన ప్రమాణాలు మెరుగుపర్చేందుకు అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నామని సీఎం వెల్లడించారు. కొందరు కావాలని దుష్ప్రచారం చేస్తున్నారని అలాంటి వారు చేసే ఫేక్ ప్రచారాలను పట్టించు కోవద్దని స్పష్టం చేశారు. నెల్లూరు కావలి నియోజకవర్గం తుమ్మలపెంట గ్రామంలో మంగళవారం మత్స్య కారుల సేవలో కార్యక్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పాల్గొన్నారు. వేట నిషేధ సమయంలో 1,30,796 మంది మత్స్య కార కుటుంబాలకు రూ. 261.50 కోట్ల ఆర్థిక సాయాన్ని అందించారు. మత్స్య కారుల సేవలో కార్యక్రమంతో మత్స్య కారుల కుటుంబానికి రూ.20 వేలు చొప్పున ఆర్థిక సాయాన్ని అందించారు. సీఎం ప్రసంగిస్తున్న సమయంలోనే మత్స్య కారుల సేవలో లబ్దిదారుల ఖాతాల్లోకి నిధులు జమ అయ్యాయి. దీంతో తమకు డబ్బులు జమ అయ్యాయంటూ సంతోషం వ్యక్తం చేస్తూ సెల్ ఫోన్లల్లో వచ్చిన మెసేజీలను ముఖ్యమంత్రికి లబ్దిదారులు చూపించారు. ఈ కార్యక్రమం సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడుతూ..."సముద్ర తీర ప్రాంతంలో పోర్టులు వస్తే అభివృద్ధి జరుగుతుంది. తీర ప్రాంతంలో జరిగే అభివృద్ధిలో మత్స్య కారులకూ భాగస్వామ్యం ఉండాలి. అభివృద్ధిని మత్స్య కారులు అందిపుచ్చుకునేలా ప్రణాళికలు చేస్తాం. కావలి ప్రాంతంలో సాగర్ డిఫెన్స్ సంస్థ ఏర్పాటు అవుతోంది. దీని ద్వారా స్థానికులకే ఉపాధి, ఉద్యోగాలు లభిస్తాయి. రూ.288 కోట్లతో జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్ నిర్మాణం చేపడుతున్నాం. మత్స్య కారులను ఆర్థికంగా బలోపేతం చేసేలా జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్ కేంద్రంగా ప్రణాళికలు సిద్దం చేస్తున్నాం. వీటిపై కొందరు అపోహలు సృష్టించే ప్రయత్నం చేశారు. ఈ విషయంలో ఎలాంటి అపోహలకూ తావులేదు. ఫేక్ ప్రచారాలను నమ్మ వద్దు. ఈ తీరం మనది, బోటూ మనదే.. ఇక్కడ సంపద కూడా మనదే. ఈ విషయంలో రాజీ లేదు. మన తీరప్రాంతానికి పొరుగు రాష్ట్రం వారు ఎవరొచ్చినా సహించేది లేదు. మత్స్యకారుల హక్కులు కాపాడతాం. మన తీరప్రాంతంలో నిఘా పెట్టి పొరుగు రాష్ట్రాల బోట్లు రాకుండా చర్యలు తీసుకుంటాం. తీరం మనదే, బోటు మనదే వేటా మనదే ఇదే సీబీఎన్ మాట."అని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు.

**మత్స్య ఉత్పత్తులకు మార్కెటింగ్ మేనేజర్ లా వ్యవహరిస్తా...** "రాష్ట్రంలోని రిజర్వాయర్లు, చెరువుల్లో నీళ్లు నిండుగా ఉన్నాయి. అక్కడ చేపల పెంపకం చేపట్టండి. ఆ మత్స్య సంపదను విక్రయించుకునే హక్కులను మత్స్య కారులకే అప్పగించాం. రాష్ట్రవ్యాప్తంగా నీటి వనరుల్లో ఫిష్ సీడ్ ను అందించేలా మత్స్య శాఖకు ఆదేశాలిచ్చాం. చేపల వేటతో పాటు కొత్త ఆదాయ మార్గాలను కూడా మత్స్య కారులకు అందుబాటులోకి తెస్తాం. మన రాష్ట్రానికి సుదీర్ఘ సముద్ర తీరప్రాంతం ఉంది. సముద్ర తీరప్రాంతంలో నివసించే మత్స్య కారుల జీవితాల్లో వెలుగులు నింపేలా చర్యలు చేపడుతున్నాం. టెక్నాలజీతోపాటు... వినూత్న పద్దతుల ద్వారా మత్స్య కారులను ఆర్థికంగా ఆదుకుంటాం. చేపల వేటకు వెళ్లే మత్స్య కారులకు అండగా నిలబడడమే కాకుండా... మత్స్య కార మహిళలకు ఉపాధి కల్పించి.. ఆర్థిక సాధికారత కల్పిస్తాం. సీవీడ్ కల్చర్ ద్వారా మత్స్య కారుల జీవితాల్లో వెలుగులు నింపుతాం. మత్స్య కార మహిళలు, డ్వాక్రా సంఘాల మహిళలు సముద్రపు నాచు పెంపకం ద్వారా అదనపు ఆదాయం వచ్చేలా చేస్తాం. చేపలు మంచి పౌష్టికాహారం. ప్రపంచవ్యాప్తంగా మంచి డిమాండ్ ఉంది. ప్రోటీన్ ఉన్న ఈ ఆహారానికి అన్ని చోట్లా గిరాకీ

2లో

# పల్లె ప్రగతికి పారదర్శక సర్వే

- తద్వారా గ్రామాలకు అవసరమైన మౌలిక సదుపాయాల గుర్తింపు
- పల్లెలు ఆర్థికంగా, సామాజికంగా బలోపేతం
- జియో ట్యాగింగ్ తో రోడ్ల పర్యవేక్షణ, డూప్లికేషన్ కు చెక్
- పల్లె పండుగ 1, 2 ద్వారా గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పన
- గిరిజన ప్రాంతాలకు మ్యాజిక్ డ్రెయిన్లు విస్తరణ
- పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ఉన్నతాధికారులతో ప్రత్యేక సమీక్ష నిర్వహించిన ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్



**విజయవాడ, కలంకౌంటర్ :** గ్రామాల సమగ్రాభివృద్ధి కోసం అత్యంత పారదర్శకంగా క్షేత్ర స్థాయిలో సర్వే నిర్వహించాలని ఉప ముఖ్యమంత్రి పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి పవన్ కళ్యాణ్ అధికారులను ఆదేశించారు. ప్రతి గ్రామంలో ప్రస్తుతం ఉన్న సౌకర్యాలు ఏమిటి? ఇంకా ఎలాంటి అవసరాలు ఉన్నాయనే వివరాలతోపాటు పంచాయతీ భూములు, పోరంబోకు స్థలాలు, పశువుల మేత మైదానాలు, స్మశానవాటికల పూర్తి వివరాలను నమోదు చేయాలని సూచించారు. ఈ సర్వే నివేదికలు ఆధారంగా గ్రామాల్లో భూములకు రక్షణ కల్పించడంతోపాటు ప్రతి గ్రామం స్వయం సమృద్ధి సాధించేలా నూతన ఆదాయ వనరులను సృష్టించవచ్చని అన్నారు. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ఉన్నతాధికారులతో మంగళవారం క్యాంపు కార్యాలయంలో పవన్ కళ్యాణ్ ప్రత్యేక సమీక్ష నిర్వహించారు. పల్లె పండుగ 1, 2 కార్యక్రమాల ద్వారా రాష్ట్రవ్యాప్తంగా గ్రామాల్లో జరుగుతున్న ప్రగతిపై సుదీర్ఘంగా చర్చించారు. ఈ సందర్భంగా పవన్ కళ్యాణ్ మాట్లాడుతూ... "పల్లె పండుగ 1, 2 కార్యక్రమాల ద్వారా రాష్ట్రవ్యాప్తంగా గ్రామీణ ప్రాంతాలలో మౌలిక సదుపాయాల కల్పన వేగంగా జరుగుతోంది. పల్లె పండుగ తొలి విడతలో అనుకున్నట్లుగానే పూర్తిగా 4వేల కిలోమీటర్ల రోడ్ల నిర్మాణం పూర్తయింది. అలాగే 2వ విడతలో 2,750 కిలోమీటర్లు నిర్మించాలని లక్ష్యంగా పెట్టుకోగా, అంతకంటే ఎక్కువగా 3,580 కిలోమీటర్ల మేర రోడ్లను నిర్మించాం. మొదటి విడతలో 22,500 గోకులాలు నిర్మించాలనే లక్ష్యానికి గానూ 22,514 పూర్తి చేశాం. రెండవ విడతలో 15 వేల లక్ష్యానికి గానూ 15,303 గోకులాలు నిర్మించాం. పశువుల తాగునీటి అవసరాల కోసం 15 వేల లక్ష్యానికి గానూ 15,188 నీటి తొట్టెలు నిర్మించాం. మొదటి విడతలో 20 వేల ఫార్మ్ పాండ్స్ లక్ష్యానికి గానూ 21 వేలు పూర్తి చేశాం. రెండవ విడతలో ఈ పనులను భారీగా పెంచి, 81 వేలు లక్ష్యానికి గానూ 86 వేలు ఫార్మ్ పాండ్స్ కుంటలను తవ్వించాం. గ్రామాల్లో మురుగునీటి సమస్య నివారణకు పల్లె పండుగ 2.0 కింద సరికొత్తగా 59 కిలోమీటర్ల మేర మ్యాజిక్ డ్రైన్స్ నిర్మించాలని లక్ష్యంగా పెట్టుకోగా, ఇప్పటికే క్షేత్రస్థాయిలో 32.30 కిలోమీటర్ల మేర పనులు పూర్తయ్యాయి.

**మ్యాజిక్ డ్రెయిన్లు విస్తరించాలి..** గ్రామాల్లో మురుగునీటి సమస్యను శాశ్వతంగా అరికట్టేందుకు మ్యాజిక్ డ్రెయిన్స్ విధానాన్ని మరింత ఎక్కువ గ్రామాల్లో ప్రవేశపెట్టాలి. నల్లరేగడి నేలలు, డెల్టా ఏరియాల్లో నీరు ఎక్కువగా నిల్వ ఉంటుంది కాబట్టి, అక్కడి భూములకు తగినట్లుగా ఈ మ్యాజిక్ డ్రెయిన్లను నిర్మించాలి. కొండలు, గుట్టలతో కూడిన మారుమూల గిరిజన గ్రామాల్లో కూడా పరిశుభ్రతను పెంచేందుకు ఈ సరికొత్త డ్రైనేజీ వ్యవస్థను అందుబాటులోకి తీసుకురావాలి. ఈ పనులు చాలా కాలం మన్నేలా, శాస్త్రీయంగా ఉండటం కోసం నిపుణులైన ఇంజనీర్లు, పారిశుధ్యం-ప్రజారోగ్య నిపుణులు సలహాలు, సూచనలు కచ్చితంగా తీసుకోవాలి.

**రోడ్ల నాణ్యతపై రాజీపడొద్దు..** గ్రామాల్లో నిర్మించే సీసీ రోడ్లు దీర్ఘకాలం మన్నేలా ఉండాలి. రోడ్ల నిర్మాణంలో నాణ్యతా ప్రమాణాలను కచ్చితంగా పాటించాలి. నాణ్యత లోపిస్తే

- 3లో

# ఆదరణ 3.0తో శాశ్వత ఉపాధి - రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత



**అమరావతి,కలంకౌంటర్ :** ఆదరణ 3.0 పథకం ద్వారా బీసీలకు శాశ్వత ఉపాధి కల్పించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత మరియు జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత తెలిపారు. బీసీలను వ్యాపారవేత్తలుగా తీర్చిదిద్దే లక్ష్యంతో ఈ పథకం ద్వారా ఆధునిక పనిముట్లు అందజేస్తామన్నారు. రాష్ట్ర సచివాలయంలోని తన ఛాంబర్ లో బీసీ సంక్షేమ శాఖాధికారులతో మంత్రి సవిత మంగళవారం ఆదరణ 3.0 పథకం అమలుపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు తొలుత ఆదరణ 3.0 పథకం అమలులో భాగంగా కుల వృత్తులకు ఎటువంటి ఆధునిక పరికరాలు ఇవ్వనున్నారో వివరించారు. యువతకు కూడా ఉపాధి లభించేలా యూనిట్లు ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. అనంతరం మంత్రి సవిత మాట్లాడుతూ, బీసీలకు ఆర్థిక మేలు కలిగించడంతో పాటు వారిని వ్యాపారవేత్తలుగా తీర్చిదిద్దాలన్నదే కూటమి ప్రభుత్వం లక్ష్యమన్నారు. గతంలో ఆదరణ 1, ఆదరణ 2 పథకాలను సీఎం చంద్రబాబు అమలు చేశారన్నారు. ఇప్పుడు ఆదరణ 3.0 పథకానికి శ్రీకారం చుడుతున్నారని, ఇందుకోసం రూ.1000 కోట్లు వెచ్చిస్తున్నారని వెల్లడించారు. వ్యక్తిగతంగా, గ్రూపులుగా లబ్ధి కలిగేలా ఆదరణ యూనిట్ల ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. కుల వృత్తుదారులకు ఆధునిక పనిముట్లు అందజేయనున్నామన్నారు. లబ్ధిదారులకు వృత్తి నైపుణ్యం పెంచుకునేలా శిక్షణ అందజేస్తామన్నారు. లబ్ధిదారులకు రూ. 10 వేల నుంచి రూ. 50 వేల వరకు ఆదాయం వచ్చేలా యూనిట్ల ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఆదరణ ఉత్పత్తులకు మార్కెటింగ్ సౌకర్యం ప్రభుత్వమే కల్పిస్తుందని మంత్రి సవిత తెలిపారు. ఇప్పటికే అన్ని బీసీ కులాల కార్పొరేషన్ల చైర్మన్లు, డైరెక్టర్లతో ఆదరణ 3.0 పథకంపై అభిప్రాయాలు తీసుకున్నామన్నారు. యూనిట్ల మంజూరులో వారి అభిప్రాయాలను పరిగణలోకి తీసుకుంటామని మంత్రి సవిత వెల్లడించారు. ఈ సమావేశంలో బీసీ సంక్షేమ శాఖ కార్యదర్శి ఎస్.సత్యనారాయణ, ఇతర అధికారులు, వివిధ బీసీ కార్పొరేషన్ల చైర్మన్లు పేరేపి ఈశ్వర్, మల్లెల ఈశ్వరరావు, ఆకాశపు స్వామి, హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.



# మత్స్యకార కుటుంబంతో ముఖ్యమంత్రి చంద్రబాబు భోజనం

● కుటుంబ సభ్యులతో కలిసి కింద కూర్చుని భోజనం చేసిన సీఎం







**కావలి,కలంకౌంటర్ :** నెల్లూరు జిల్లా కావలి మండలం తుమ్మలపెంటలో ఓ మత్స్యకార కుటుంబం ఇంట్లో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు భోజనం చేశారు. మార్కెట్‌లో స్వయంగా చేపలు కొనుగోలు చేసి...స్థానిక మత్స్యకారుని ఇంటికి వెళ్లి వండించుకుని తిన్నారు. కుటుంబ సభ్యుడిలా వారితో కలిసి కింద కూర్చుని భోజనం చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు మంగళవారం శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా కావలి నియోజకవర్గంలో పర్యటించారు. కావలి మండలం తుమ్మలపెంట గ్రామంలో నిర్వహించిన 'మత్స్యకారుల సేవలో' కార్యక్రమంలో పాల్గొన్నఅనంతరం స్థానిక చేపల మార్కెట్‌ను సందర్శించి మత్స్యకారులతో మాట్లాడారు. అక్కడ ఉన్న మహిళా వ్యాపారుల నుంచి చేపలు కొనుగోలు చేశారు. మార్కెట్ సందర్శనకు వచ్చిన ముఖ్యమంత్రికి మత్స్యకారుడు తానంగారి బాబు, ఆయన కుమారుడు గిరి స్వాగతం పలికారు. సీఎం తమ మార్కెట్‌కు రావడం పట్ల మత్స్యకారులు, వ్యాపారులు ఆనందం వ్యక్తం చేశారు. మత్స్యకారుడు తానంగారి బాబుతో మాట్లాడిన ముఖ్యమంత్రి... వారి జీవనోపాధి, చేపల వేట పరిస్థితులు, మార్కెట్‌లో చేపల విక్రయాలపై అడిగి తెలుసుకున్నారు. 'మత్స్యకారుల సేవలో' పథకం ద్వారా ఏడాదికి అందుతోన్న రూ.20 వేల ఆర్థిక సాయం తమ కుటుంబాలకు ఎంతో ఉపయోగపడుతోందని బాబు సీఎంకు వివరించారు. స్థానికంగా లభించే చేపల రకాల గురించి సీఎం ఆసక్తిగా అడిగి తెలుసుకున్నారు.

**మత్స్యకారుడి ఇంట...ముఖ్యమంత్రి భోజనం..** మార్కెట్‌లో సందర్శన అనంతరం స్థానిక మత్స్యకారుడు తానంగారి బాబు ఆహ్వానం మేరకు సీఎం వారి ఇంటికి చేరుకున్నారు. ఈ సందర్భంగా మార్కెట్ లో కొనుగోలు చేసిన చేపలు తీసుకుని వెళ్లారు. తానంగారి బాబు సతీమణి వెంకమ్మ ముఖ్యమంత్రి తెచ్చిన చేపలను తమ ఇంట్లో వండారు. వెంకమ్మ చేపల పులుసు పెట్టే సమయంలో సీఎం చంద్రబాబు అక్కడే ఉండి కూర వండే విధానాన్ని పరిశీలించారు. సరదాగా కొద్దిసేపు గరిటె తిప్పారు. ఇటీవల బిడ్డకు జన్మనిచ్చిన వెంకమ్మ కుమార్తెతో మాట్లాడి తల్లీబిడ్డ బాగోగుల గురించి ఆరా తీశారు. వెంకమ్మ చేపల కూర సిద్ధం చేయడంతో వారి ఇంట్లోనే కుటుంబ సభ్యులతో కలిసి కింద కూర్చుని భోజనం చేశారు. ఈ సందర్భంగా సీఎం స్వయంగా తన చేతులతో వారికి చేపల పులుసును వడ్డించారు. అనంతరం వారితో కలిసి ముఖ్యమంత్రి చంద్రబాబు గ్రూప్ ఫోటో దిగారు. తమఇంటికి వచ్చిన ముఖ్యమంత్రికి తానంగారి బాబు కుటుంబ సభ్యులు ధన్యవాదాలు తెలిపారు.

# ముఖ్యమంత్రి కి స్వాగతం పలికిన ఎమ్మెల్యే



**కందుకూరు, కలంకౌంటర్ :** మత్స్యకారుల సేవలో పథకం అమలులో భాగంగా... లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేసేందుకు, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మంగళవారం కావలి నియోజకవర్గం తుమ్మలపెంట గ్రామానికి విచ్చేశారు. మంత్రులు, సహచర శాసనసభ్యులతో కలిసి కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు ముఖ్యమంత్రి కి స్వాగతం పలికారు.

# తీరం మనదే-మత్స్య సంపదా మనదే







(మొదటిపేజీ తరువాయి)

ఉంది. మత్స్య ఉత్పత్తులకు గిరాకీ సృష్టించేలా మార్కెటింగ్ మేనేజర్ గా వ్యవహరిస్తాను."అని ముఖ్యమంత్రి వెల్లడించారు.

**మత్స్య కారుల సేవలో ఉంటాం... అండగా నిలుస్తాం..** "దేశంలో చేపల ఉత్పత్తిలో ఆంధ్రప్రదేశ్ అగ్రగామిగా ఉంది. ఇది కొనసాగాలంటే... మత్స్య కారులకు మరిన్ని సౌకర్యాలు కల్పించాలి... వారికి అండగా నిలవాలి. ఆ దిశగా ప్రభుత్వం అన్ని రకాల చర్యలు తీసుకుంటోంది. మత్స్య కారులకు మేం అండగా ఉంటాం. మెకనైజ్డ్, మోటరైజ్డ్ డీజిల్ పడవలకు లీటరుకు రూ.9 మేర డీజిల్ సబ్సిడీ ఇస్తున్నాం. 2026-27లో రూ.50 కోట్ల విలువైన డీజిల్ సబ్సీడిని మత్స్య కార బోట్లకు అందించాం. రూ.3256 కోట్లతో 9 ఫిషింగ్ హార్బర్లు, 8 ఫిష్ ల్యాండింగ్ సెంటర్లను కూడా ప్రభుత్వం నిర్మిస్తోంది. మత్స్య కారుల రక్షణ కోసం సముద్రంలో 4,550 ట్రాన్స్ పాండర్లను ఏర్పాటు చేసి కమ్యూనికేషన్ వ్యవస్థను ఏర్పాటు చేశాం. పడవలు, వలలు, పరిహారం సకాలంలోనే ప్రభుత్వం అందిస్తోంది. 200 మెకనైజ్డ్ బోట్లను మత్స్యకారుల కోసం శాంక్షన్ చేస్తాం. 60 శాతం సబ్సిడీ ఇవ్వటంతో పాటు మిగిలిన మొత్తాన్ని రుణంగా మంజూరు చేస్తాం. మత్స్య కారులు సముద్రంలో వేటకు వెళ్లినప్పుడు చేపలు ఎక్కడ లభ్యం అవుతాయో అనే సమాచారాన్ని కూడా ఇస్తున్నాం. మెకనైజ్డ్ బోట్లతో సులువుగా చేపల వేట చేసేలా ప్రభుత్వం సహకారం అందిస్తుంది. ఆక్వా కల్చర్ కు అభివృద్ధి కోసం ఒక్కో యూనిట్ కు రూ.1.50కే విద్యుత్ సరఫరా చేస్తున్నాం. మన రాష్ట్రానికి ఏ రంగంలో ఆదాయం వస్తుందో దానిపై శ్రద్ధ పెట్టి ప్రోత్సాహకాలు అందిస్తున్నాం. చేపల వేట నిషేధ సమయంలో మత్స్య కారుల సేవలో పేరిట రూ.20 వేల చొప్పున చేయూత అందిస్తున్నాం. రాష్ట్రంలో మత్స్య కారుల సంక్షేమం గురించి నిరంతరం ఆలోచిస్తూ వారిని ఆదుకుంటున్నాం. ఉమ్మడి రాష్ట్రంలో ప్రతీ మత్స్య కార కుటుంబానికి 50 కేజీల చొప్పున బియ్యం ఇచ్చి సాయం చేశాం. 2014-19 మధ్యలోనూ చేపలవేట నిషేధ సమయంలో మత్స్యకారులకు రూ.10 వేల వరకూ ఆర్థిక సాయం చేసి టీడీపీ ప్రభుత్వం ఆదుకుంది. మళ్లీ ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రూ.20 వేలకు ఆర్థిక సాయాన్ని పెంచి ఇస్తున్నాం."అని ముఖ్యమంత్రి వివరించారు.

**విధ్వంసం నుంచి వికాసం వైపు...** "గత పాలకులు రాష్ట్రాన్ని విధ్వంసం చేశారు. ఎక్కడా అభివృద్ధి చేయలేదు. సంక్షేమం అందించలేదు. అన్ని రంగాలను విధ్వంసం చేశారు.. వ్యవస్థలను నిర్వీర్యం చేశారు. అలాగే మత్స్య రంగం కూడా దెబ్బతినేలా చేశారు. రాష్ట్రానికున్న సుదీర్ఘమైన తీరప్రాంతంలో లక్షల మంది మత్స్య కారులు చేపల వేటతో ఉపాధి పొందుతున్నారు. వారికి నాటి ఐదేళ్ల పాలనలో కష్టాలే ఉన్నాయి. 2019-24 మధ్యలో చేపల ఉత్పత్తి దారుణంగా పడిపోయింది. వ్యవసాయం, నిర్మాణ రంగం తర్వాత మత్స్య సంపద పైనే ఎక్కువ మంది ఆధారపడుతున్నారు. ఇలాంటి రంగాన్ని కూడా వాళ్లు విధ్వంసం బాట పట్టించారు. గొడ్డలి పార్టీ లేనిపోని కుట్రలు చేస్తోంది. కూటమి ప్రభుత్వం సంక్షేమం చేస్తుంటే గొడ్డలి పార్టీ ఫేక్ ప్రచారాలు చేస్తోంది. బాబాయ్ హత్య నుంచి పెద్ద దస్తగిరి వరకూ హత్యలు చేస్తూ... కుట్రలు పన్నుతూ రాష్ట్రాన్ని వెనక్కు లాగుతోంది. వైసీపీ చేసిన విధ్వంసాన్ని సరి చేయడానికి 23 నెలల సమయం పట్టింది. సంక్షేమం, అభివృద్ధి, సుపరిపాలన అందించటంతో పాటు విశాఖ, అమరావతి, తిరుపతి రీజియన్లుగా ఏపీని అభివృద్ధి చేస్తున్నాం. బుల్లెట్ స్పీడ్ లో ప్రభుత్వం ముందుకు వెళ్తోంది. రూ.23 లక్షల కోట్ల పెట్టుబడులు వస్తున్నాయి. 24 లక్షల మందికి ఉద్యోగాలు కూడా వస్తాయి. రాయలసీమలో డిఫెన్సు, డ్రోన్స్, స్పేస్ ఏరోస్పేస్, ఎలక్ట్రానిక్స్ రంగంలో పరిశ్రమలు వస్తున్నాయి. రాయల్ ఎన్ ఫీల్డ్ సంస్థ తిరుపతి వద్ద బుల్లెట్ మోటారు సైకిల్ తయారీ ప్లాంట్ ఏర్పాటు చేస్తోంది. నెల్లూరు జిల్లాకు పెద్ద ఎత్తున పరిశ్రమలు వచ్చాయి. మరిన్ని వస్తాయి. పారిశ్రామికంగా జిల్లా అభివృద్ధి చెందుతుంది. ఈ ప్రాంతంలో 25 మత్స్య కారుల గ్రామాలను కనెక్టు చేస్తూ మెటల్ రోడ్లు వేస్తాం. నార్త్ బకింగ్ హామ్ కెనాల్ డీసిల్టింగ్ కు రూ.6.19 కోట్లను మంజూరు చేస్తున్నాం. ఈ కాలువను ఇన్ ల్యాండ్ వాటర్ వేస్ గానూ తీర్చిదిద్దుతాం. ప్రతీ ఇంటిపైనా, పొలంలోనూ సోలార్ రూఫ్ టాప్ ద్వారా విద్యుత్ ఉత్పత్తి చేసుకునే అవకాశం కల్పిస్తున్నాం. కావలి నియోజకవర్గం తుమ్మలపెంట గ్రామాన్ని ఆదర్శగ్రామంగా తీర్చిదిద్దుతాం."అని ముఖ్యమంత్రి చెప్పారు.

**టీడీపీ డీఎన్ఏలోనే బీసీలు..** "టీడీపీ డీఎన్ఏలోనే బీసీలు ఉన్నారు. బీసీలకు- టీడీపీకి దశాబ్దాల అనుబంధం. చేనేత కార్మికులకు 200 యూనిట్లు, మర మగ్గాలకు 500 యూనిట్ల ఉచిత విద్యుత్ ఇస్తున్నాం. నాయీ బ్రాహ్మణులకు రూ.25 వేల వేతనం, వడ్డెర్లకు, గీత కార్మికులకు గనులు, మద్యం దుకాణాలను కేటాయిస్తున్నాం. 45 ఏళ్లుగా బీసీలు టీడీపీని ఆదరించారు. వారి రుణం తీర్చుకుంటాం. బీసీల కోసం... బీసీ మహిళల కోసం కొత్త విధానాలను అమల్లోకి తెచ్చి.. వారిని ఆర్థికంగా చేయూత ఇస్తున్నాం. సీవీడ్ లాంటి కొత్త ప్రత్యామ్నాయాలను ఎంచుకోవటం ద్వారా అదనపు ఆదాయం సంపాదించేలా చర్యలు చేపడతాం. మత్స్య కారుల జీవన ప్రమాణాలు పెంచటమే లక్ష్యంగా ప్రజా ప్రభుత్వం పనిచేస్తోంది. మత్స్య కార యువతకు నైపుణ్యాలు నేర్పి ఆదాయాన్ని రెట్టింపు చేసేలా ప్రయత్నిస్తున్నాం. ప్రజాప్రతినిధులు, అధికారులు అంతా ప్రజల సేవకులే. జవాబుదారీతనంతో పనిచేయాలనే లక్ష్యాన్ని పెట్టాం. పశ్చిమ ఆసియాలో యుద్ధ ప్రభావం మనపై కూడా పడింది. ఆయిల్ ధరలు పెరిగాయి. గ్యాస్ కొరత ఉంది. మనం అంతా నా దేశం- నా బాధ్యత అనుకుని పనిచేయాలి. ప్రధాని మోదీ 7 సూత్రాలను సూచించారు. వర్క్ ఫ్రమ్ హోమ్ చేయాలి. అనవసరపు ప్రయాణాలు తగ్గించుకుందాం. ప్రజా రవాణాను మాత్రమే వినియోగిద్దాం. బంగారం కొనుగోలును వాయిదా వేద్దాం. టూరిజం కోసం విదేశీ ప్రయాణాలు తగ్గించుకుందాం. మన దేశంలోనే పర్యాటక ప్రాంతాలు, బీచ్ లకు వెళ్లాలి."అని ముఖ్యమంత్రి సూచించారు.

**మత్స్యకార మహిళలకు సీవీడ్ సాగులో శిక్షణ..** మత్స్య కారుల సేవలో బహిరంగ సభ వేదిక సమీపంలో ఏర్పాటు చేసిన వ్యవసాయ, ఉద్యాన శాఖల స్టాళ్లను ముఖ్యమంత్రి తిలకించారు. అలాగే సీవీడ్, తీర ప్రాంత నిఘా కేంద్రాన్ని సందర్శించారు. తీర ప్రాంతంలో సముద్రపు నాచు సాగు చేసేలా మత్స్య కార మహిళలకు శిక్షణ ఇచ్చే కార్యక్రమాన్ని ఈ సందర్భంగా సీఎం ప్రారంభించారు. కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ సీఎస్ఎంసీఆర్ఐ సహకారంతో మత్స్యకార మహిళలు అదనపు ఆదాయం పొందేలా సీవీడ్ కల్చర్ చేసేందుకు శిక్షణ ఇవ్వనున్నారు. తీరప్రాంతాల్లో మహిళలు సముద్రంలో సీవీడ్ సాగు చేసేలా శిక్షణతో పాటు మౌలిక సదుపాయాలు కల్పించేలా రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోంది. ఈ మేరకు మత్స్యకార మహిళల శిక్షణకు నిధులు మంజూరు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. నెల్లూరు జిల్లా తీరప్రాంతంలో నిరంతర పర్యవేక్షణ కోసం జాయింట్ యాక్షన్ టాస్క్ ఫోర్స్ ఫర్ సీ పెట్రోలింగ్ కేంద్రాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు సందర్శించారు. మెరైన్ పోలీస్, మత్స్యశాఖ, అటవీశాఖ, స్థానిక మత్స్య కారులతో సంయుక్తంగా సీ పెట్రోలింగ్ జాయింట్ యాక్షన్ టాస్క్ ఫోర్సును ఏర్పాటు చేశారు. ఇతర రాష్ట్రాల మత్స్యకారుల బోట్లు చొరబడకుండా గస్తీ కోసం శాటిలైట్ చిత్రాల సాయం తీసుకోవాలని ముఖ్యమంత్రి నిర్దేశించారు. డ్రోన్ల ద్వారా గస్తీ నిర్వహించి హెచ్చరికలు జారీ చేసే సాంకేతిక వ్యవస్థను అధికారులు సీఎం ఎదుట ప్రదర్శించారు. ఏపీ సరిహద్దుల్లోని సముద్ర జలాల్లోకి ప్రవేశించిన పొరుగు రాష్ట్రాల బోట్లకు తెలుగు, తమిళం ఇతర భాషల్లో హెచ్చరికలు జారీ చేసేలా డ్రోన్లను వినియోగిస్తున్నట్టు అధికారులు సీఎంకు వివరించారు. స్థానిక మత్స్య కార బోట్లు అంతర్జాతీయ జలాల్లోకి వెళ్లినప్పుడు హెచ్చరికలు వచ్చే జీపీఎస్ ట్రాకింగ్ వ్యవస్థను సీఎం పరిశీలించారు. ఇక స్థానికంగా పండిన మామిడి కాయలను పరిశీలించిన ముఖ్యమంత్రి రైతును అభినందించారు. డీఆర్డీఓ, వెపన్ సిస్టమ్స్ తయారీ కంపెనీల స్టాళ్లను సీఎం సందర్శించారు. ఈ కార్యక్రమంలో మంత్రులు ఆనం రామనారాయణ రెడ్డి, అచ్చెన్నాయుడు, ఫరూఖ్, ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, ఎమ్మెల్యే కావ్యా కృష్ణారెడ్డి తదితర ప్రజాప్రతినిధులు, జిల్లా ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# తెలంగాణ రాష్ట్రంలో ఉన్న ఏపీ వక్ఫ్ బోర్డు రికార్డులు ఏపీ కు బదిలీ

● ఏపీ వక్ఫ్ బోర్డుకు రికార్డుల అప్పగింతలో కీలక అడుగు. ● పదేళ్లుగా పెండింగ్ లో ఉన్న రికార్డుల సమస్య పరిష్కారం దిశగా అడుగులు. ● ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, మంత్రి ఎన్.ఎం.డి ఫరూక్ జోక్యంతో సానుకూల పరిణామం. ● రికార్డులతో పాటు బకాయి నిధుల సాధన కూ చర్యలు ● ఏపీ వక్ఫ్ బోర్డ్ చైర్మన్ షేక్ అబ్దుల్ అజీజ్



**అమరావతి,కలంకౌంటర్ :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విభజన అనంతరం ఏపీ వక్ఫ్ బోర్డుకు సంబంధించిన కీలక రికార్డులు, ఫైళ్లు, సర్వే ఫారం లు, జిల్లా వారీ గెజెట్లు, బోర్డు తీర్మానాల ప్రతులు మరియు ఇతర ముఖ్య పత్రాలు గత పదేళ్లుగా తెలంగాణ వక్ఫ్ బోర్డు పరిధిలోనే ఉండిపోయిన విషయం తెలిసిందే. వక్ఫ్ చట్టం--1995 మరియు కేంద్ర ప్రభుత్వం రూపొందించిన విభజన మార్గదర్శకాల ప్రకారం ఏపీకి సంబంధించిన అన్ని రికార్డులు, ఆస్తుల వివరాలు మరియు సంబంధిత నిధులు ఏపీ వక్ఫ్ బోర్డుకు బదిలీ కావాల్సి ఉన్నప్పటికీ, గత కొన్నేళ్లుగా ఆ ప్రక్రియ ముందుకు సాగలేదు. అయితే తాను ఏపీ వక్ఫ్ బోర్డ్ చైర్మన్ బాధ్యతలు స్వీకరించిన తరువాత ఈ అంశాన్ని అత్యంత ప్రతిష్టాత్మ కంగా తీసుకుని తెలంగాణ వక్ఫ్ బోర్డు చైర్మన్‌ను తాను స్వయంగా కలిసి ప్రత్యేక దృష్టి సారించినట్లు అబ్దుల్ అజీజ్ తెలిపారు. అదే విధంగా తెలంగాణ వక్ఫ్ బోర్డు సీఈఓ మరియు ఇతర ఉన్నతాధికా రులతో పలుమార్లు సమావేశాలు నిర్వహించి, అధికారిక లేఖల ద్వారా ఈ అంశాన్ని ముందుకు తీసుకువచ్చినట్లు చెప్పారు. ఈ అంశంపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మరియు మైనారిటీస్ సంక్షేమ శాఖ మంత్రి ఎన్.ఎం.డి ఫరూక్ ప్రత్యేకంగా స్పందించి, సంబంధిత స్థాయిల్లో జోక్యం చేసుకోవడంతో పాటు సమస్య పరిష్కారానికి విశేష సహకారం అందించారని అబ్దుల్ అజీజ్ పేర్కొన్నారు. వారి జోక్యం కారణంగానే ఈ అంశంలో వేగవంతమైన పురోగతి సాధ్యమైందన్నారు. నిరంతర అనుసరణలు, అధికార స్థాయి చర్చలు మరియు పరిపాలనా కృషి ఫలితంగా తెలంగాణ ప్రభుత్వం చివరకు ఓ మెమో ద్వారా హైదరాబాద్ జిల్లా కలెక్టర్‌కు రికార్డు గదిని విడుదల చేసి తెలంగాణ రాష్ట్ర వక్ఫ్ బోర్డు సీఈఓ అప్పగించాలని ఆదేశాలు జారీ చేయడం స్వాగతించదగ్గ పరిణామమని పేర్కొన్నారు. తెలంగాణ వక్ఫ్ బోర్డు వద్ద ప్రస్తుతం ఏపీ వక్ఫ్ బోర్డుకు సంబంధించి మొత్తం 2971 ఫైళ్లు, 8 సర్వే కమిషనర్ రిపోర్ట్ పుస్తకాలు, 3 గెజెట్లు ఉన్నాయని తెలిపారు. రికార్డు రూమ్ ను ఖాళీ చేసి రికార్డు లను తెలంగాణ సీఈఓ కు అందించిన తర్వాత ఏపీ రికార్డు లను స్వాధీనం చేసుకుంటామని తెలిపారు. ఇప్పటికే ఏపీ వక్ఫ్ బోర్డు తరఫున అధికార బృందాలను పంపించి రికార్డుల గుర్తింపు, ఇన్వెంటరీ మరియు స్వీకరణ ప్రక్రియను వేగవంతం చేసినట్లు చెప్పారు. అదేవిధంగా, ఏపీ వక్ఫ్ బోర్డుకు రావాల్సిన బకాయి నగదు నిల్వలు, డిపాజిట్లు మరియు ఇతర ఆర్థిక బకాయిలు రూ. 55.5 కోట్లు ఉన్నాయని తెలిపారు. ఈ కీలక రికార్డులు వక్ఫ్ ఆస్తుల పరిరక్షణ, న్యాయపరమైన కేసుల నిర్వహణ, సర్వే ధృవీకరణ మరియు కేంద్ర ప్రభుత్వ ఉమీద్ పోర్టల్‌లో వివరాల అప్‌లోడ్‌కు అత్యంత అవసరమని పేర్కొన్నారు. రికార్డులతో పాటు ఏపీ వక్ఫ్ బోర్డుకు రావాల్సిన బకాయి నగదు నిల్వలు, డిపాజిట్లు మరియు ఇతర ఆర్థిక అంశాలను కూడా తిరిగి సాధించేందుకు చర్యలు కొనసాగుతున్నాయని ఆయన వెల్లడించారు. ఆ బకాయిలను కూడా త్వరలోనే ఏపీ వక్ఫ్ బోర్డుకు తీసుకువచ్చేందుకు అన్ని స్థాయిల్లో చర్చలు మరియు పరిపాలనా చర్యలు జరుగుతున్నాయని తెలిపారు. ఏపీకి చెందిన ప్రతి వక్ఫ్ ఆస్తి, ప్రతి రికార్డు, ప్రతి రూపాయి ప్రజల హక్కు అని, వాటిని పూర్తిస్థాయిలో తిరిగి సాధించేందుకు తమ పోరాటం కొనసాగుతుందని అబ్దుల్ అజీజ్ స్పష్టం చేశారు. వక్ఫ్ ఆస్తుల రక్షణలో ఎలాంటి రాజీ ఉండదని, భవిష్యత్ తరాలకు వక్ఫ్ ఆస్తులను భద్రంగా అందించడం తమ బాధ్యత అని పేర్కొన్నారు. ఈ ప్రక్రియలో సహకరిస్తున్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, మంత్రి ఎన్.ఎం.డి ఫరూక్, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, తెలంగాణ ప్రభుత్వం, కేంద్ర వక్ఫ్ కౌన్సిల్ మరియు సంబంధిత అధికారులకు ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

# నెల్లూరు జిల్లా తీరప్రాంతంలో నిరంతర పర్యవేక్షణ కోసం జాయింట్ యాక్షన్ టాస్క్ ఫోర్స్ ఫర్ సీ పెట్రోలింగ్ కేంద్రాన్ని సందర్శించిన సీఎం



**శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లా,కలంకౌంటర్ :** మెరైన్ పోలీస్, మత్స్యశాఖ, అటవీశాఖ, స్థానిక మత్స్యకారులతో సంయుక్తంగా సీ పెట్రోలింగ్ జాయింట్ యాక్షన్ టాస్క్ ఫోర్సు ఏర్పాటు ఇతర రాష్ట్రాల మత్స్యకారుల బోట్లు చొరబడకుండా గస్తీ కోసం శాటిలైట్ చిత్రాల సాయం కూడా తీసుకోవాలని నిర్దేశించిన ముఖ్యమంత్రి డ్రోన్ల ద్వారానూ గస్తీ నిర్వహించి హెచ్చరికలు జారీ చేసేలా సాంకేతికతను ప్రదర్శించిన అధికారులు ఏపీ సరిహద్దుల్లోని సముద్ర జలాల్లోకి ప్రవేశించిన పొరుగు రాష్ట్రాల బోట్లకు తెలుగు, తమిళం ఇతర భాషల్లో హెచ్చరికలు జారీ చేసేలా డ్రోన్ల వినియోగం మత్స్యకారుల సేవలో బహిరంగ సభా వేదిక సమీపంలో ఏర్పాటు చేసిన వ్యవసాయ, ఉద్యాన శాఖల స్టాళ్లను తిలకించిన ముఖ్యమ ంత్రి స్థానికంగా పండిన మామిడి కాయలను పరిశీలించి రైతును అభినందించిన ముఖ్యమంత్రి చంద్రబాబు సీవీడ్,సహా డీఆర్డీఓ ఇతర వెపన్ సిస్టమ్స్ తయారీ కంపెనీల స్టాళ్లను సందర్శించిన ముఖ్యమంత్రి స్థానిక మత్స్యకార బోట్లు అంతర్జాతీయ జలాల్లోకి వెళ్లినప్పుడు హెచ్చరికలు వచ్చేలా జీపీఎస్ ట్రాకింగ్ వ్యవస్థలను పరిశీలించిన సీఎం రాష్ట్రవ్యాప్తంగా నీటి వనరుల్లో ఫిష్ సీడ్ ను అందించేలా మత్స్యశాఖకు ఆదేశాలు జారీ చేసిన ముఖ్యమంత్రి

# నేడు మెడికల్ షాపులు బంద్

-తహసిల్దార్ కు వినతి పత్రం

**మోపిదేవి,కలంకౌంటర్ :** మోపిదేవి మెడికల్ అసోసియేషన్ సభ్యులు మంగళవారం తహసిల్దార్ హరినాథ్ కు నేడు జరిగే సమ్మెకు సహకరించాలని వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో మెడికల్ షాపు యజమానులు విశ్వం శెట్టి సుధాకర్, విశ్వం శెట్టి రాజేష్ కైతేపల్లి శ్రీధర్ విషంశెట్టి కేశవ పాల్గొన్నారు.



# సింహాద్రి నాథుడు సేవ పూర్వజన్మ సుకృతం

● అందరి సహకారంతోనే దేవాలయాల అభివృద్ధి ● గంట్ల శ్రీనుబాబును సత్కరించిన వేదుల దక్షిణామూర్తి



**అక్కయ్యపాలెం,కలంకౌంటర్ :** భక్తులు.. .దాతలు.. ఇలా అందరి సహకారంతోనే దేవాలయాల అభివృద్ధి సాధ్యమవుతుందని సింహాచలం దేవస్థానం ధర్మకర్తల మండలి.. మాజీ సభ్యులు... ప్రత్యేక ఆహ్వానితులు ..జాతీయ జర్నలిస్టుల సంఘం కార్యదర్శి గంట్ల శ్రీనుబాబు అన్నారు.. సింహాచలం దేవస్థానం ట్రస్ట్ బోర్డు ప్రత్యేక ఆహ్వానితులుగా ఇటీవల నియమితులైన వేదుల దక్షిణామూర్తి మంగళవారం గంట్ల శ్రీనుబాబును అక్కయ్యపాలెం లోని తన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలుసుకొని ఘనంగా సత్కరించారు.. ఈ సందర్భంగా గంట్ల శ్రీనుబాబు మాట్లాడుతూ సింహాద్రి నాథుడు అత్యంత మహిమాన్వితులన్నారు.. అటువంటి దేవదేవుడు సేవ చేసుకునే భాగ్యం అందరికీ రాదని ఆ అవకాశం దక్షిణామూర్తికి దక్కినందుకు ప్రత్యేకంగా అభినందిస్తున్నట్లు చెప్పారు...సింహాచలం దేవస్థానం అభివృద్ధికి పూర్తిస్థాయిలో సేవలు అందించాలని.. భక్తులకు మరింతగా మెరుగైన సదుపాయాలు కల్పించాలని ఆ దిశగా దక్షిణామూర్తి తన వంతు కృషి చేయాలని గంట్ల శ్రీనుబాబు ఆకాంక్షించారు.. ఈ సందర్భంగా దక్షిణామూర్తి మాట్లాడుతూ అప్పన్న దేవస్థానం ధర్మకర్తల మండలి సభ్యుడిగా.. ప్రత్యేక ఆహ్వానితులుగా.. చందనోత్సవం కమిటీ సభ్యులుగా.. వివిధ అనుబంధాలయాల గౌరవ అధ్యక్షులుగా గంట్ల శ్రీనుబాబు అందిస్తున్న సేవలు ఎంతోమందికి ఆదర్శప్రాయం అన్నారు.. జర్నలిస్టుగా సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ అలాగే ఎంతోమందికి ఆపన్న హస్తం అందిస్తున్న గంట్ల శ్రీనుబాబు సేవలు ప్రశంసనీయమన్నారు. తాను కూడా శక్తివంచన లేకుండా సింహాచలం ఆలయ అభివృద్ధికి కృషి చేస్తానన్నారు.. ఈ సందర్భంగా దక్షిణామూర్తిని గంట్ల శ్రీనుబాబు మర్యాదపూర్వకంగా సత్కరించి అభినందనలు తెలిపారు.. ఈ కార్యక్రమంలో ధార్మిక సెల్ రాష్ట్ర కన్వీనర్ విజయ్ శంకర్ ఫణి తదితరులు పాల్గొన్నారు.

# దళిత డ్రైవర్ సుబ్రహ్మణ్యం కు ఎమ్మెల్యే కాగిత ఘన నివాళి





**బంటుమిల్లి,కలంకౌంటర్ :** ఎమ్మెల్సీ అనంత బాబు చేతిలో చనిపోయిన దళిత డ్రైవర్ సుబ్రహ్మణ్యం చిత్రపటానికి మంగళవారం ఎమ్మెల్యే కాగిత కృష్ణ ప్రసాద్ పూలమాలవేసి ఘనంగా నివాళు లర్పించారు. మంగళవారం బంటుమిల్లి మండలం ముందులూరు గ్రామంలో దళిత డ్రైవర్ సుబ్రహ్మణ్యం కు నివాళులర్పించే కార్యక్రమంలో పెడన ఎమ్మెల్యే కాగిత కృష్ణ ప్రసాద్ పాల్గొన్నారూ తొలుత గ్రామంలో అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు అనంతరం దళిత డ్రైవర్ సుబ్రహ్మణ్యం చెప్పడానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కృష్ణ ప్రసాద్ మాట్లాడుతూ 256 మంది దళితులపై దాడులు చేశారని. దళిత న్యాయమూర్తుల పైన దాడులు చేశారని అలాగే డాక్టర్ సుధాకర్ నీ చిత్రహింసలకుగురిచేసి చంపేశారని గుర్తు చేశారు. ఎమ్మెల్సీ అనంత బాబు దళిత డ్రైవర్ సుబ్రహ్మణ్యం చంపి డోర్ డెలివరీ చేసిన అనంతబాబుని జగన్మోహన్ రెడ్డి ప్రోత్సహించుతూ పార్టీలోనే కొనసాగిస్తున్నారని విమర్శించారు.

# ఆర్థిక ఇబ్బందులున్నా, సంక్షేమం అమలులో వెనకడుగు వేయం - స్పష్టం చేసిన ఎమ్మెల్యే ఇంటూరి

● కూటమి ప్రభుత్వంలోనే మత్స్యకారులకు మేలు జరిగింది

● సముద్రతీర గ్రామాలను చక్కగా అభివృద్ధి చేస్తున్నాం ● మత్స్యకారుల సేవలో..ఎమ్మెల్యే



**కందుకూరు, కలంకౌంటర్ :** మత్స్యకారుల సేవలో పథకం ద్వారా, వేట విరామ సమయంలో కూటమి ప్రభుత్వం అందిస్తున్న నిధులు రాష్ట్రవ్యాప్తంగా మంగళవారం విడుదల కాగా.... ఉలవపాడు మండలం కరేడు పంచాయతీలోని అలగాయపాలెంలో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు పాల్గొన్నారు. ఒక్కో లబ్ధిదారు కుటుంబానికి 20 వేల రూపాయల చొప్పున అందిస్తున్నట్లు చెప్పారు.ఎమ్మెల్యే నాగేశ్వరరావు మాట్లాడుతూ ఉలవపాడు మండలంలో 2,230 కుటుంబాలకు 4. 46 కోట్ల రూపాయలు, గుడ్లూరు మండలంలో 252 కుటుంబాలకు 50.4 లక్షలు విడుదలైనట్లు తెలిపారు. మొత్తంగా కందుకూరు నియోజకవర్గంలోని 2,482 మత్స్యకార కుటుంబాల ఖాతాల్లో 4.96 కోట్లు జమ అయ్యాయని వివరించారు. 217 జీవో రద్దు, వేట సమయంలో ఆర్థిక సహాయం, బోట్ల రిజిస్ట్రేషన్, హైస్పీడ్ బోట్ల నిషేధం లాంటి విషయాలలో కూటమి ప్రభుత్వం మత్స్యకారులకు అన్ని విధాలుగా అండగా నిలుస్తోందని నాగేశ్వరరావు తెలిపారు.గత ప్రభుత్వంలో మత్స్యకార గ్రామాలలో అభివృద్ధి పనులు జరగలేదని, తమ ప్రభుత్వంలో సిసి రోడ్లు, డ్రైనేజీ కాలువల నిర్మాణం, తాగు సాగునీటి వసతి, స్మశానాల అభివృద్ధి, అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందేలా కృషి చేస్తున్నట్లు ఎమ్మెల్యే వివరించారు.మత్స్యకారుల కోసం రామాయపట్నం సమీపంలో 4.5 ఎకరాల విస్తీర్ణంలో, సుమారు 28 కోట్ల రూపాయలతో జెట్టి నిర్మాణాన్ని చేపడుతున్నట్లు ఎమ్మెల్యే నాగేశ్వరరావు తెలిపారు. దీనివల్ల బోట్లు నిలుపుదల, అన్ లోడింగ్, ప్లాట్ ఫారం లాంటి ఆధునిక వసతులు అందుబాటులోకి వస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో సురేష్, తహసిల్దార్ రవిశంకర్, మత్స్య శాఖ డివో రమేష్, మండల టిడిపి అధ్యక్షులు రాచగర్ల సుబ్బారావు, ప్రధాన కార్యదర్శి సుదర్శి శ్రీను, ఉపాధ్యక్షుడు కన్నా ప్రసాద్, గ్రామ పార్టీ అధ్యక్షుడు నేలటూరి ఆదాము, క్లస్టర్ ఇంచార్జ్ పోలుబోయిన శ్రీను, పార్టీ నాయకులు వాయిల శ్రీను, జాలమ్మ, వెంకట్రామిరెడ్డి, శ్రీకాంత్, కాటంగారి యానాది, బాలమురళి, రామదాసు, పోలిశెట్టి, చెంచురామిరెడ్డి, కొల్లి రమణ, పిగిలి రమణ, తేజ, అన్ని గ్రామ పార్టీల అధ్యక్షులు, అనుబంధ కమిటీల నాయకులు పాల్గొన్నారు.

# కోరిక, పట్టుదల, క్రమశిక్షణ ఉంటే ఏదైనా సాధ్యమే: అరికెపూడి రమణరావు

● విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని సూచన ● ఏపీలోనే మూడు శాతం క్రీడా రిజర్వేషన్లతో నేరుగా ఉద్యోగావకాశాలు ● నున్నలో రెజ్లింగ్, హాకీ వేసవి శిక్షణ శిబిరాన్ని సందర్శించిన శాప్ డైరెక్టర్లు





**విజయవాడ రూరల్,కలంకౌంటర్ :** అనుకున్న లక్ష్యాన్ని చేరుకోవాలంటే కోరిక (డిజైర్), పట్టుదల (డెడికేషన్), క్రమశిక్షణ (డిసిప్లిన్) ఎంతో అవసరమని రాష్ట్ర క్రీడాప్రాధికార సంస్థ (శాప్) డైరెక్టర్, ద్రోణాచార్య మరియు అర్జున అవార్డు గ్రహీత అరికెపూడి రమణరావు అన్నారు. విద్యార్థులు సంకల్పంతో ముందుకు సాగితే ఏదైనా సాధ్యమేనని పేర్కొన్నారు. చదువుతో పాటు క్రీడల్లోనూ ప్రతిభ కనబరిస్తే మంచి భవిష్యత్తు సాధించవచ్చని తెలిపారు. రాష్ట్ర క్రీడాప్రాధికార సంస్థ (శాప్) సహకారంతో ఎన్టీఆర్ జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ (డీఎస్ఏ) ఆధ్వర్యంలో విజయవాడ రూరల్ మండలం నున్నలోని పీఎం శ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న రెజ్లింగ్, హాకీ వేసవి శిక్షణ శిబిరాన్ని శాప్ డైరెక్టర్లు అరికెపూడి రమణరావు, సంతోష్ కుమార్, జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి (డీఎస్డీఓ) కాకర్ల కోటేశ్వరరావు, జిల్లా యువజన సంక్షేమ అధికారి (డీవైడబ్ల్యూఓ) డాక్టర్ కొల్లేటి రమేష్ మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా రెజ్లింగ్ క్రీడాకారులకు శాప్ అందిస్తున్న ప్రత్యేక కాస్ట్యూమ్స్‌ను వారు ఆవిష్కరించారు. అనంతరం శిక్షణ పొందుతున్న విద్యార్థుల మధ్య నిర్వహించిన రెజ్లింగ్ పోటీలను ప్రారంభించి, విద్యార్థులు ప్రదర్శించిన టెక్నిక్స్‌పై అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా రమణరావు మాట్లాడుతూ, సుమారు నాలుగు దశాబ్దాల క్రితం ప్రతిభ ఆధారంగా క్రీడాకారులకు ఎలాంటి రాత పరీక్షలు లేకుండానే ప్రభుత్వ ఉద్యోగాలు లభించేవని గుర్తు చేశారు. ముఖ్యమంత్రి ఎన్ చంద్రబాబు నాయుడు క్రీడలను ప్రోత్సహించే దిశగా మూడు శాతం క్రీడా రిజర్వేషన్లను అమలు చేయడంతో మళ్లీ క్రీడాకారులకు నేరుగా ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నారని తెలిపారు. ఇందుకు ఎలాంటి రాత పరీక్ష అవసరంలేదని, క్రీడా ప్రతిభే గీటురాయని తెలిపారు. జాతీయ, రాష్ట్రస్థాయి పోటీలలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన సుమారు 421 మంది ఉపాధ్యాయ ఉద్యోగాలకు ఎంపికైనట్లు తెలిపారు. ఈ అవకాశాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. వేసవి క్రీడా శిక్షణ శిబిరాలలో తర్ఫీదు పొందిన వారు, తాము శిక్షణ పొందిన క్రీడలలో రెగ్యులర్‌గా ప్రాక్టీస్ చేయాలని, ఇందుకు ప్రభుత్వం నుంచి అవసరమైన సహకారాన్ని అందిస్తామన్నారు. ఎన్టీఆర్ జిల్లా డీఎస్డీఓ కాకర్ల కోటేశ్వరరావు మాట్లాడుతూ, నున్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో క్రీడలకు లభిస్తున్న ఆదరణపై హర్షం వ్యక్తం చేశారు. వ్యాయామ ఉపాధ్యాయుల అంకితభావంతో పాఠశాలకు వరుసగా రెండేళ్లుగా రాష్ట్రస్థాయి స్కూల్ ఆఫ్ స్పోర్ట్స్ ఎక్సలెన్స్ అవార్డు లభిస్తోందన్నారు. శాప్ ఆధ్వర్యంలో ప్రత్యేక కోచ్‌ల సహకారంతో విద్యార్థులకు మరింత మెరుగైన శిక్షణ అందిస్తామని చెప్పారు. అనంతరం పాఠశాలకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించడంలో సహకరిస్తున్న పూర్వ విద్యార్థి నరెడ్ల సత్యనారాయణరెడ్డిని అతిథులు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో డీవైడబ్ల్యూఓ డాక్టర్ కొల్లేటి రమేష్, స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి టీ శ్రీలత, వ్యాయామ ఉపాధ్యాయులు టీ విజయ్ వర్మ, ఎంవీ సత్య ప్రసాద్, ఉపాధ్యాయుడు నళినిరామ్ తదితరులు పాల్గొన్నారు.

# అమావాస్యకో పౌర్ణానికో వచ్చి అబండాలు వేయడం మానుకోవాలి-- ఎమ్మెల్యే ఇంటూరి



**కందుకూరు,కలంకౌంటర్ :** అమావాస్య పౌర్ణాని కో వైసీపీ ఇన్చార్జి బుర్ర మధుసూదన్ యాదవ్ ఇక్కడికి వచ్చి మాపై అబండాలు వేయడం మానుకోవాలని ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో ఎమ్మెల్యే ఇంటూరు నాగేశ్వరరావు మాట్లాడుతూ యుద్ధం కారణంగా పెట్రోల్ ధరలు కేంద్రం పెంచితే అవి తమ ప్రభుత్వం ఏదో పెంచినట్లుగా ధర్నాలు చేయడం హాస్యాస్పదంగా ఉందని అన్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో అన్ని రాష్ట్రాల కన్నా ఎక్కువ పెంచింది అని అప్పుడు ఈ మాట్లాడే వారందరూ ఏమయ్యారని అన్నారు. అంకమ్మ తల్లి ఆలయం ఎదురుగా ఉన్న స్థలం అది ఎవరికి సంబంధించింది కాదని అది పురపాలక సంఘానికి సంబంధించిందని తాసిల్దార్ లికిత పూర్వకంగా రాసిచ్చారని చూపించారు. ఇక మాలకొండ విషయంలో తలనీలాలు పాట పాడిన వారి దగ్గర నుంచి సుమారు కోటి 30 లక్షల రూపాయలు వసూలు చేసిన ఘనత తమకే చెందుతుందని అన్నారు. గత ప్రభుత్వంలో కన్నా వేలం పాటల ద్వారా స్వామివారికి అదనంగా నిధులు చేకూరాలని తెలిపారు. తమ ఇంటిదయము మాలకొండ శ్రీ మాల్యాద్రి లక్ష్మీనరసింహస్వామి అని అటువంటి స్వామివారి అభివృద్ధికి కృషి చేస్తానే తప్ప, మరో విధంగా చేయనని ఎమ్మెల్యే అన్నారు. వైసీపీ ప్రభుత్వం లో దళితులకు ఎంతో ద్రోహం చేసిందని, దళితులను అన్ని విధాల మోసం చేసిన పార్టీ వైసీపీ అని తీవ్రంగా మండిపడ్డారు. రాబోవు ఎన్నికల్లో 11 సీట్ల కోసం పనిచేసే పరిస్థితి వస్తుందని ఎమ్మెల్యే అన్నారు. ఈ రెండు సంవత్సరాల్లోనే ఎన్నో రెవెన్యూ సమస్యలను ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ద్వారా పరిష్కరించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు దామల్లేశ్వరరావు, ఉన్నం వీరాస్వామి, మాదాల లక్ష్మీనరసింహం తదితర టిడిపి నాయకులు పాల్గొన్నారు.

# పల్లె ప్రగతికి పారదర్శక సర్వే

(మొదటిపేజీ తరువాయి)

సహించేది లేదు. సీసీ రోడ్డు వేసిన తర్వాత ఇరువైపులా అలాగే వదిలేయకుండా, మట్టితో పక్కాగా వాలు చేయాలి. వాలు చేయకుండా వదిలేస్తే వాహన ప్రమాదాలు జరిగే అవకాశంతోపాటు వర్షాకాలంలో నీరు నిలిచిపోయి రోడ్డు అంచులు త్వరగా పాడైపోతాయి. పల్లె ప్రజలకు నాణ్యమైన, దీర్ఘకాలం మన్నే రహదారులను అందించడమే లక్ష్యంగా రోడ్లకు జియో మానిటరింగ్ సిస్టమ్ ను తీసుకొచ్చాం. రోడ్ల పర్యవేక్షణ, డూప్లికేషన్ కు చెక్ పెట్టేందుకు ఈ డిజిటల్ పద్ధతి సహాయపడుతుంది. ఏ గ్రామంలో, ఏ ప్రాంతంలో ఎంతవరకు రోడ్డు పనులు జరిగాయో శాటిలైట్, జియో-ట్యాగింగ్ ద్వారా క్షేత్రస్థాయిలో కచ్చితంగా తెలుసుకోవచ్చు. ఈ సాంకేతికత ద్వారా సేకరించిన వివరాల ఆధారంగా, ఆయా గ్రామాల్లోని రోడ్లను ఇతర ముఖ్య ప్రాంతాల రోడ్లతో సులభంగా అనుసంధానం చేయవచ్చు. ప్రజలు కూడా రోడ్ల యొక్క ప్రస్తుత స్థితిగతులను ఆన్‌లైన్ ద్వారా నేరుగా తెలుసుకునే అవకాశం ఉంటుంది.

**నిర్దేశించిన పనులకే అనుమతులు..** ఉపాధి హామీ నిధులను ప్రభుత్వ నిర్దేశించిన బడ్జెట్ పరిమితి వరకే జిల్లా కలెక్టర్లు మంజూరు చేయాలి. అంతకు మించి అదనంగా ఇవ్వడం వల్ల ప్రభుత్వ లెక్కలకు, క్షేత్రస్థాయి ఖర్చులకు పొంతన లేకుండా పోయి నిధుల దుర్వినియోగానికి, ఆడిట్ ఇబ్బందులకు దారితీస్తుంది. అలాగే ఉపాధి హామీ మార్గదర్శకాల ప్రకారం అనుమతించిన పనులను మాత్రమే గ్రామాల్లో చేపట్టాలి. ప్రభుత్వ నిబంధనల జాబితాలో లేని ఎలాంటి ఇతర పనులను ఉపాధి హామీ కింద చేయడానికి వీలు లేదు. వికసిత్ భారత్ గ్యారెంటీ ఫర్ రోజ్‌గార్ అండ్ ఆజీవికా మిషన్ గ్రామీణ్ (వీబీ-జీ రామ్ జీ) చట్టాన్ని స్వర్ణాంధ్ర లక్ష్యాలకు అనుగుణంగా గ్రామీణ ప్రాంతాల్లో పనులను సమర్థవంతంగా చేపట్టేందుకు తగిన కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేయాల”ని చెప్పారు. ఈ సమావేశంలో పంచాయతీరాజ్ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ కాంతిలాల్ దండే, పంచాయతీరాజ్ కమిషనర్ కృష్ణతేజ పాల్గొన్నారు.

# ఆరోగ్యం జాగ్రత్త - డాక్టర్ డి.జీవన లత



ఈ వారం రోజుల పాటు మన చుట్టుపక్కల ప్రాంతాల్లో ఉష్ణోగ్రతలు 43°C కి పైగా నమోదయ్యే అవకాశం ఉంది.

అందరూ తప్పనిసరిగా జాగ్రత్తలు పాటించండి.

అత్యవసరం అయితే తప్ప మధ్యాహ్నం 11 నుంచి 4 గంటల మధ్య బయటకు వెళ్లొద్దు

తరచుగా నీరు, మజ్జిగ, కొబ్బరి నీళ్లు వంటి ద్రవాలు తీసుకోండి

పిల్లలు, వృద్ధులు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలి

తేలికపాటి, పలుచని బట్టలు ధరించండి


బయటకు వెళ్లేటప్పుడు గొడుగు / టోపీ ఉపయోగించండి

తలనొప్పి, తిమ్మిరి, అధిక అలసట, వాంతులు వంటి లక్షణాలు ఉంటే వెంటనే వైద్యుడిని సంప్రదించండి

“వేడి తీవ్రతను తక్కువ అంచనా వేయొద్దు... జాగ్రత్తే రక్షణ.”

# మత్స్యకారుల జీవితాల్లో వెలుగులు నింపుతున్న ప్రభుత్వంపై విష ప్రచారం సిగ్గుచేటు

● వ్యవసాయ, మత్స్యశాఖల మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు



**అమరావతి,కలంకౌంటర్ :** కుక్క తోక వంకర వైసీపీ నేతల బుద్ధి చిందరవందర అని వ్యవసాయ, మత్స్యశాఖల మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. ప్రజలకు మంచి జరుగుతుంటే జీర్ణించుకోలేక అబద్ధాలు, విష ప్రచారాలతో రాష్ట్రంలో గందరగోళం సృష్టించేందుకు వైసీపీ నేతలు ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. మత్స్యకారుల ఖాతాల్లో కోట్ల రూపాయల సంక్షేమ నిధులు నేరుగా జమ అవుతున్నా, వాస్తవాలను వక్రీకరించి ప్రభుత్వంపై బురదజల్లడం వైసీపీకి, వారి మానస పుత్రిక, అబద్ధాల నిండు కుండ సాక్షి దినపత్రికకు అలవాటైపోయిందన్నారు. గతంలో మత్స్యకారులను మోసం చేసి ఇప్పుడు వారిపట్ల ప్రేమ నటించడం ప్రజలను మభ్యపెట్టే రాజకీయ డ్రామా తప్ప మరొకటి కాదని అచ్చెన్నాయుడు ఘాటుగా వ్యాఖ్యానించారు. మత్స్యకారుల సంక్షేమంపై అసత్యాలు ప్రచారం చేసి రాజకీయ లబ్ధి పొందాలని చూస్తున్న వారికి ప్రజలే తగిన బుద్ధి చెబుతారని మంత్రి హెచ్చరించారు. సాక్షి పత్రికలో మత్స్యకారుల జీవితాల్లో వెలుగులు నింపుతున్న కూటమి ప్రభుత్వంపై ఉద్దేశపూర్వకంగా దుష్ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. గత ఐదేళ్లలో మత్స్యకారులను కేవలం ఓటు బ్యాంక్‌గా మాత్రమే చూసిన వారు, ఇప్పుడు మత్స్యకారుల సంక్షేమంపై మాట్లాడటం హాస్యాస్పదం. మా ప్రభుత్వం మాటలు కాదు... నేరుగా మత్స్యకారుల బ్యాంకు ఖాతాల్లో నిధులు జమ చేస్తోంది. అర్హులైన ఒక్క మత్స్యకారుడికి కూడా అన్యా యం జరగకుండా పూర్తి పారదర్శకంగా సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తున్నాం అని స్పష్టం చేశారు. సముద్ర జీవ సంపదను పరిరక్షించేందుకు ప్రతి సంవత్సరం ఏప్రిల్ 15 నుంచి జూన్ 14 వరకు 61 రోజుల చేపల వేట నిషేధ కాలం అమలు చేస్తున్నామని మంత్రి తెలిపారు. ఈ సమయంలో ఉపాధి కోల్పోయే సముద్ర మత్స్యకార కుటుంబాలకు ప్రభుత్వం భరోసాగా నిలుస్తోందన్నారు. గతంలో కేవలం బియ్యం పంపిణీతో సరిపెట్టారని, 2014-15లో రూ.2 వేల నగదు, 2016-18 మధ్య రూ.4 వేల సహాయం ఇచ్చిన ఘనత తెలుగుదేశం ప్రభుత్వానిదని గుర్తు చేశారు. 2019లో వేట నిషేధ భృతిని రూ.10 వేలకు పెంచాం. ఇప్పుడు కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే దాన్ని రూ.20 వేలకు పెంచి మత్స్యకార కుటుంబాలకు నిజమైన అండగా నిలిచింది అని మంత్రి తెలిపారు. మోటారు లేని పడవల యజమానులు, సిబ్బందిని కూడా పథకం పరిధిలోకి తీసుకొచ్చి, అర్హులైన ప్రతి కుటుంబానికి సంతృప్తి స్థాయిలో భృతి అందిస్తున్నామని చెప్పారు. 2025-26 సంవత్సరంలో 1,21,433 మత్స్యకార కుటుంబాలకు రూ.242.866 కోట్లు చెల్లించామని, 2026-27 సంవత్సరానికి మొత్తం 1,52,248 మంది మత్స్యకారులను గుర్తించి, అందులో 1,30,796 మందికి భృతి చెల్లింపుల కోసం సిఫార్సు చేశామని వెల్లడించారు.

# పుచ్చలపల్లి సుందరయ్య 41వ వర్ధంతి



**ఉయ్యూరు,కలంకౌంటర్ :** దక్షిణ భారత కమ్యూనిస్టు ఉద్యమ నేతగా సమానత్వం సమ సమాజస్థాపన కోసం అహర్నిశలు పోరాడిన వ్యక్తి పుచ్చలపల్లి సుందరయ్య అని జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కె శివ నాగేంద్రం అన్నారు. మంగళవారం సుందరయ్య 41 వ వర్ధంతి పురస్కరించుకుని ఉయ్యూరు విజ్ఞాన కేంద్రంలో సీనియర్ సిపిఎం పార్టీ నాయకులు పడాల లక్ష్మణరావు పార్టీ జెండా ఆవిష్కరించారు. అనంతరం సుందరయ్య చిత్రపటానికి శివ నాగేంద్రం పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పట్టణ కార్యదర్శి బి రాజేష్ సీనియర్ నాయకులు రత్నం భాస్కరరావు పార్టీ సభ్యులు కలపాల రవి గిద్దలూరు కోటేశ్వరరావు కంప్యూటర్ ట్రైనింగ్ సెంటర్ విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

కలంకౌంటర్
KALAM COUNTER TELUGU DAILY
తెలుగు దినపత్రిక
కలంకౌంటర్ దినపత్రిక లో యాడ్స్ కోసం సంప్రదించండి..
సెల్ : 9346935672

# ఆర్యవైశ్యుల ఐక్యత అగ్రస్థానానికి దోహదపడుతుంది

- ఐ వి ఎఫ్ జాతీయసీనియర్ వర్కింగ్ ప్రెసిడెంట్ ఉప్పల శ్రీనివాస్ గుప్తా
- జిల్లా ప్రమాణ స్వీకార మహోత్సవానికి హాజరైన రాష్ట్ర అధ్యక్షుడు కోనా శ్రీనివాసరావు, అంబికా కృష్ణ, మాజీ డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి







**విజయనగరం,కలంకౌంటర్ :** ఆర్యవైశ్యులు ఐక్యత అన్ని రంగాల్లో అగ్రస్థానానికి దోహదపడుతుందని ఐ వి ఎఫ్ జాతీయ సీనియర్ వర్కింగ్ ప్రెసిడెంట్ ఉప్పల శ్రీనివాస్ గుప్తా అన్నారు. ఆర్యవైశ్య సామాజిక వర్గం ఆర్థిక రంగానికే పరిమితం కాకుండా రాజకీయంగా, సామాజికంగా కూడా అగ్రస్థానంలో నిలవాలని ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్ (ఐవీఎఫ్) జాతీయ సీనియర్ వర్కింగ్ ప్రెసిడెంట్ ఉప్పల శ్రీనివాస గుప్తా పిలుపునిచ్చారు. మంగళవారం విజయనగరంలోని టెంపుల్లో నిర్వహించిన నూతన కమిటీ ప్రమాణ స్వీకార కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ, దేశ ఆర్థికాభివృద్ధిలో వైశ్యుల పాత్ర కీలకమని, ప్రభుత్వాలకు పన్నుల రూపంలో అత్యధిక ఆదాయం అందిస్తున్నది వైశ్యులేనని గుర్తుచేశారు. సామాజిక సేవ లక్ష్యంగా ఐవీఎఫ్ నిరంతరం పనిచేస్తోందని, పేద వైశ్య కుటుంబాలకు అండగా నిలవడంలో సంఘం ఎప్పుడూ ముందుంటుందని తెలిపారు. జనాభా మరియు సమాజానికి చేస్తున్న సేవలను దృష్టిలో ఉంచుకొని అన్ని రాజకీయ పార్టీలు వైశ్యులకు తగిన ప్రాధాన్యత ఇవ్వాలని డిమాండ్ చేశారు. చట్టసభల్లో వైశ్యుల ప్రాతినిధ్యం పెరిగితేనే సమాజంలో మరింత గౌరవం లభిస్తుందని అభిప్రాయపడ్డారు. వైశ్య యువత సంప్రదాయ వ్యాపారాలకే పరిమితం కాకుండా ఆధునిక స్టార్టప్లు, పారిశ్రామిక రంగాలు, సివిల్ సర్వీసుల వైపు అడుగులు వేయాలని సూచించారు. పేద వైశ్య కుటుంబాల విద్యార్థుల ఉన్నత చదువులకు, నిరుద్యోగ యువత స్వయం ఉపాధికి ఐవీఎఫ్ ద్వారా సహాయం అందిస్తున్నామని, భవిష్యత్తులో మరిన్ని సంక్షేమ కార్యక్రమాలు చేపడతామని హామీ ఇచ్చారు. దేశ ప్రగతికి కృషి చేస్తున్న వైశ్య వ్యాపారులకు పూర్తి భద్రత కల్పించాలని, చిన్న వ్యాపారులను అధికారుల అక్రమ వేధింపుల నుంచి రక్షించాలని ప్రభుత్వాన్ని కోరారు. "ప్రాంతాలు, రాజకీయ పార్టీలు వేర్వేరు కావొచ్చు. కానీ వైశ్యుల హక్కులు, ఆత్మగౌరవం విషయానికి వస్తే అందరం ఒక్కటిగా నిలబడాలి. పరస్పర సహకారంతోనే వైశ్య సమాజం మరింత ఉన్నత స్థాయికి చేరుకుంటుంది" అని ఉప్పల శ్రీనివాస్ గుప్తా పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ శాసన సభ్యుడు, అంబికా దర్బార్ బత్తి సంస్థ అధినేత అంబిక కృష్ణ మాట్లాడుతూ, ఆర్యవైశ్యులు రాజకీయాల్లోకి రావాలని పిలుపునిచ్చారు. యువత నూతన ఆలోచనలతో వ్యాపార రంగంలో ముందుకు రావాలని సూచించారు. విజయనగరం మాజీ డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి మాట్లాడుతూ, ఆర్యవైశ్యుల అభ్యున్నతికి తమ కుటుంబం ఎల్లప్పుడూ సహకరిస్తుందని తెలిపారు. నగరంలో వివిధ సంఘాల ద్వారా నిర్వహించే సేవా కార్యక్రమాల్లో భాగస్వామ్యం కావడం ఆనవాయితీగా కొనసాగుతోందని చెప్పారు. అనంతరం నూతన కమిటీ సభ్యులను సత్కరించి అభినందనలు తెలిపారు. ఐవీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కోన శ్రీనివాసరావు మాట్లాడుతూ, వైశ్యులు వ్యాపార రంగానికే పరిమితం కాకుండా రాజకీయంగా, ఆర్థికంగా మరింత ఎదగాలని పిలుపునిచ్చారు. ప్రస్తుత రాజకీయాల్లో వైశ్యులకు తగిన ప్రాధాన్యత లభించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. జనాభా ప్రాతిపదికన రానున్న ఎన్నికల్లో అన్ని రాజకీయ పార్టీలు వైశ్యులకు తగినన్ని స్థానాలు కేటాయించాలని డిమాండ్ చేశారు. పేద వైశ్యులను ఆదుకునేందుకు వైశ్య కార్పొరేషన్కు ప్రభుత్వం పూర్తిస్థాయి నిధులు మంజూరు చేయాలని, అర్హులైన విద్యార్థులకు ఉన్నత విద్య కోసం ఆర్థిక సహాయం అందించాలని కోరారు. అమరజీవి పొట్టి శ్రీరాములు త్యాగాలను స్మరించుకుంటూ, ఆయన ఆశయాల సాధన కోసం వైశ్యులంతా ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు. రాష్ట్రవ్యాప్తంగా ఆయన స్మారక చిహ్నాల ఏర్పాటుకు ప్రభుత్వం చొరవ చూపాలని కోరారు. ఈ సందర్భంగా నూతన కమిటీ అధ్యక్షుడిగా ఆరిశెట్టి సందీప్, కార్యదర్శిగా తమ్మన కళ్యాణరాజు, కోశాధికారిగా కేదారిశెట్టి లక్ష్మణమూర్తి ప్రమాణ స్వీకారం చేశారు. అనంతరం ఉపాధ్యక్షులు, జాయింట్ సెక్రటరీలు, కార్యవర్గ సభ్యులతో కూడా ప్రమాణ స్వీకారం నిర్వహించారు. పదో తరగతిలో అత్యుత్తమ మార్కులు సాధించిన 15 మంది విద్యార్థులకు మెరిట్ సర్టిఫికెట్లు, పతకాలు అందజేయగా, పది మంది పేద మహిళలకు ఉచితంగా వెట్ గ్రైండర్లు పంపిణీ చేశారు. వైశ్య కుటుంబాల సంక్షేమం కోసం స్వంత నిధులతో మరిన్ని కార్యక్రమాలు చేపట్టనున్నట్లు నాయకులు తెలిపారు. జిల్లా అధ్యక్షుడు ఆరిశెట్టి సందీప్ మాట్లాడుతూ, జిల్లా అధ్యక్షుడిగా అవకాశం కల్పించిన సంఘం కేంద్ర, రాష్ట్ర, జిల్లా నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. సంఘం బలోపేతం, సభ్యుల సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర, జిల్లా స్థాయి ఐవీఎఫ్ నాయకులు, వివిధ జిల్లాల వైశ్య ప్రముఖులు, సంఘ ప్రతినిధులు ,పెద్ద సంఖ్యలో సభ్యులు పాల్గొన్నారు.












Printed,Published and owned by Chitta Vasavidevi Printed at Rama Offset Printers, 7th ward, Ponnuru, Guntur District-522 124 Andhra Pradesh and Published at 7th ward, Ayyappa Nagar, Ponnuru-522 124, Guntur District. Andhra Pradesh. Editor : Chitta Vasavidevi. RNI No.APTEL/2016/69464, Phone No.9346935672, kalamcounter@gmail.com